క్లుప్తంగా

రేపు ఆర్మీ అధికారులతో అవగాహన కార్యక్రమం

వాజేడు: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో మంగళవారం ఆర్మీ అధికారులతో అవగాహన కార్యక్రమం ఉన్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఐటీఐ పూర్తి చేసిన, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు ఈ అవగాహన కార్యక్రమానికి రావాలని కోరారు. ఆర్మీ ఎంపికలు, ఉద్యోగ విధులు తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఏటూరునాగారం: మండలంలోని శంకరాజుపల్లి, రొయ్యూర్ గ్రామాల్లో వివిధ కారణాలతో మృతిచెందినవారి కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు ఆదివారం పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటుదన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, గడదాసు సునీల్‌కుమార్, కాకులమర్రి ప్రదీప్‌రావు, తాడూరి రఘు, జిట్ట ఈశ్వర్, సమ్మయ్య, చిరంజీవి, వెంకటేశ్వర్లు, తిరుపతి పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



భూపాలపల్లి రూరల్: కురుమ సంఘం జిల్లా హడక్ కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం నాయకుడు కోరే సుధాకర్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీరప్ప గుడి ఆవరణంలో సంఘం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా హడక్ కమిటీ సభ్యులను ప్రకటించారు. దయ్యల కిరణ్, కోరే కుమారస్వామి, ఇండ్ల రవి, కంబాల రాజయ్య, బుర్రి కుమారస్వామి, కొమురయ్య, అమృత అశోక్, నాగరాజు, శ్రీనివాస్, శంకర్, జనార్దన్, కృష్ణ, సాంబయ్య, శ్రీకాంత్, కుమారస్వామి తదితరులను సభ్యులను నియమించినట్లు తెలిపారు. ఈ కమిటీ పూర్తిస్థాయిలో జిల్లా కమిటీని నియమించే వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నీల రమేశ్, కంచు రాజేందర్, లక్ష్మణ్, కడారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పరకాల : నడికూడ మండలం చర్లపల్లి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ వద్ద రూ.1లక్ష4వేల విలువచేసే రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పరకాల సీఐ క్రాంతికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి గ్రామం నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో కానిస్టేబుల్ దయాకర్, రాజయ్యతో పాటు సోమేష్ కలిసి వాహనాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. దీంతో వాహనంలో రేషన్ బియ్యం లభించినట్లు తెలిపారు. చర్లపల్లి గ్రామానికి చెందిన తూర్పాటి శ్రీధర్, తూర్పాటి అయిలయ్య పేదల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి బొలెరో వాహనంలో మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శివకృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

రెండేళ్లుగా అసంపూర్తిగానే..

- పిల్లర్ల దశలోనే కంకల వాగు బ్రిడ్జి నిర్మాణ పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, రైతులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



పిల్లర్ల దశలోనే ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులు

వెంకటాపురం(కె): గిరిజన గ్రామాల ప్రజల రాకపోకలు సాఫీగా సాగాలని, పంట పొలాలకు వెళ్లే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మండల కేంద్రంలోని కంకల వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులకోసం రూ.4.11కోట్ల నిధులు మంజూరు చేసింది. కానీ, అధికారుల పర్యవేక్షణ లోపం, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ అలసత్వంతో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మల్లాపురం, రాచపల్లి, క్రర్రవానిగుంపు గ్రామానికి చెందిన రైతులు ఈ రహదారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమై రెండు సంవత్సరాలు కావస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ముందుకు సాగడంలేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లర్ల దశలోనే..

కంకలవాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణాన్ని పిల్లర్ల వరకు నిర్మించారు. ఆ తర్వాత అధికారుల పట్టింపులేనితనం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. బ్రిడ్జి నిర్మాణపనులు త్వరగా పూర్తికాకపోతే వర్షాకాలంలో పొలం పనులకు వెళ్లేందుకు మళ్లీ ఇబ్బందులు తప్పవని రైతులు, ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు బ్రిడ్జి నిర్మాణంలో చొరవ చూపి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి



కంకలవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. వ్యవసాయ పనుల కోసం వాగు అవతలి వైపునకు వర్షాకాలం సీజన్‌లో వెళ్లాలంటే ఇబ్బందే. అధికా రులు దృష్టి సారించి పనులు వేగంగా చేపట్టి పూర్తయ్యేలా చూడాలి.

– చిట్టెం ఆదినారాయణ, వెంకటాపురం

పాదయాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రఘుపతి రావు

ఏటూరునాగారం/వాజేడు: మండల పరిధిలోని గుడిసెల కాలనీ నుంచి ఏటూరునాగారం ఐటీడీఏ వరకు నేడు(సోమవారం) నిర్వహించనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దబ్బకట్ల రఘుపతి రావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఇప్పగూడెం గ్రామంలో ఆదివారం మొడెం బాబూరావు అధ్యక్షన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గుడిసెల కాలనీలో మౌలిక సదుపాయాలైన తాగు నీరు, విద్యుత్ సరిగా లేవన్నారు. ఇంటి పన్నులు చెల్లించినా.. నంబర్లు ఇవ్వడం లేదని.. ఈ సమస్యలపై ఐటీడీఏ పీఓకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రానున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో దామోదర్, రవీందర్, అశోక్, సత్య సాయి, ప్రవీణ్ తదితరులున్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మికులు

మల్హర్: మండల కేంద్రం తాడిచర్లలో నేడు (సోమవారం) నిర్వహించే బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ కార్మికుల ఏఐటీయూసీ జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని సభ అధ్యక్షుడు కుడుదల వెంకటేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం తాడిచర్లలో ఏఐటీయూసీ మహాసభ కరపత్రాలను భవన నిర్మాణ కార్మికులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోని బిల్డింగ్ రంగంలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమాను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బందర్ లావణ్య, ఆకుల శ్రీనివాస్, శ్రీనివాస్, నారాయణ, రమేశ్, రవి, సతీష్, శ్యామ్, నరేష్, నర్సయ్య, కిష్టయ్య శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ..

- ఇద్దరికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం





క్షతగాత్రులు ఇర్ప అభిషేక్, రాంబాబు

వాజేడు: మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో 163 నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన ఇర్ప అభిషేక్, పద్దం రాంబాబు ద్విచక్ర వాహనాలతో ఎదురెదురుగా ఢీ కొన్నారు. ఇర్ప అభిషేక్ తారు రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వాజేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలించాలని సూచించారు. ప్రస్తుతం అభిషేక్ పరిస్థితి విషమంగా ఉండగా.. పద్దం రాంబాబును సైతం ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు



కాళేశ్వరం: మద్దతు తెలుపుతున్న నాయకులు



టేకుమట్ల: దీక్షలో పాల్గొన్న నాయకులు

కాళేశ్వరం: ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని మహదేవపూర్ మండలంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం కొనసాగాయి. ఈ దీక్షకు గంగపుత్రుల సంఘం కార్యదర్శి గరిగే రమేశ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు విజయగిరి సమ్మయ్యలతో పలువురు మద్దతు తెలిపారు. నాయకులు నాగుల ధర్మయ్య, కట్ల మురళి, మంథని రవితేజ, చింతకుంట్ల సదానందం, వేమునూరి జక్కయ్య, లింగాల కోటయ్య, జాషువా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

టేకుమట్ల: మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలకు ముఖ్య అతిథులుగా ఆ సంఘం జిల్లా నాయకులు రామ్ రాంచందర్, రేణుకుంట్ల సంపత్, రామ్‌చందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఏబీసీడీ వర్గీకరణ తామే చేస్తామని చెప్పి మాలల ఒత్తిడికి గురై మాదిగలకు అన్యాయం చేస్తున్నారన్నారు. మండల గౌరవ అధ్యక్షుడు మచ్చ సారయ్య మాదిగ టౌన్ అధ్యక్షుడు మచ్చ సరత్తమ్, పాలశంకర్, రేణిగుంట్ల బాబు పాల్గొన్నారు.

ప్రజావాణిని వినియోగించుకోవాలి

కాటారం: మండల కేంద్రంలో నేడు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ నాగరాజు ఆది వారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజా వాణి ఉంటుందని మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారుల సమక్షంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తాం..



శాయంపేట : గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని మాందారిపేట, కొత్తగట్టు సింగారం, పెద్దకోడెపాక, జోగంపల్లి, మైలారం, శాయంపేట, పత్తిపాక, నేరేడుపల్లి, కాట్రపల్లి, వసంతాపూర్, గంగిరేణిగూడెం, కొప్పు ల గ్రామాల్లో రూ.7.74 కోట్ల నిధులతో సీసీరోడ్ల నిర్మాణం, బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ప్రజల ప్రతి అవసరాన్ని తీర్చేడమే ధ్యే యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతిఒక్కరికీ అందుతున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో, ప్రజల భాగస్వామ్యంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంతో మహిళ సంఘాలకు బస్సులను అందజేసినట్లు తెలిపారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మందికి రూ.5.96లక్షల విలువచేసే సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందించారు. అనంతరం ప్రగతి సింగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పిట్టల రఘుపతి, బళ్ల సంతోశ్, చిలుకల తిరుపతి, సతీశ్, రవి, దైనంపల్లి ప్రకాశ్‌తో పాటు మరో 20మంది కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణిచంద్ర, ఏఓ గంగాజమున, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి 'అటవీ' అనుమతులు



పనులు కొనసాగుతున్న రహదారి

వాజేడు: రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉండడంతో ఆగిపోయిన రహదారి పనులు ప్రస్తుతం ప్రభుత్వ అనుమతులతో తిరిగి ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని ఏడ్జర్లపల్లి నుంచి గుమ్మడి దొడ్డి గ్రామం వరకు 12 కిలో మీటర్ల మేర ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద డబుల్ రోడ్డు మంజూరైంది. ఈ రహదారి నిర్మాణానికి రూ.13,65,18,000 కేటాయించగా.. పనులు దక్కించుకున్న కంపెనీ 2022 డిసెంబర్ 21న పనులను ప్రారంభించింది. 2023 మే 20 నాటికి పనులను పూర్తి చేయాల్సి ఉంది. కానీ, రహదారి నిర్మాణంలో ఉన్న స్థలం కొంత రిజర్వ్ ఫారెస్టులో ఉండటంతో అనుమతి కోసం కేంద్ర ప్రభుత్వానికి నివేదికలను పంపించారు. ప్రస్తుతం అనుమతులు రావడంతో మండల కేంద్రం నుంచి డబుల్ బెడ్‌రూం ఇళ్ల వరకు పనులు ప్రారంభించారు.

గూండా రాజకీయాలకు భయపడేదిలేదు..



జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అశోక్

ములుగు: బీఆర్ఎస్ పార్టీ గూండా రాజకీయాలకు భయపడేదిలేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. ఈ మేరకు అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌తోపాటు దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి ఎదుట జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ దళితులను అవమానించడమే బీఆర్ఎస్ పనిగా జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధించడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. గవర్నర్‌ను కాంగ్రెస్ కార్యకర్తగా అభివర్ణించడం బీఆర్ఎస్ నాయకుల ఏకాధిపత్య ధోరణికి నిదర్శనం అన్నారు. ఖబడ్దార్ జగదీశ్‌రెడ్డి పద్ధతి మార్చుకో అంటూ హెచ్చరించారు. గత పదేళ్లలో చేయలేని అభివృద్ధిని నేడు కాంగ్రెస్ పార్టీ చేసి చూపిస్తుంటే తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు మంత్రి సీతక్క జిల్లా అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అభివృద్ధికి మారుపేరుగా ఉన్న సీతక్క పై ఆరోపణలు చేస్తే ఊరుకునేదిలేదన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు కడుతుంటే గ్రామసభల తీర్మానం లేదని ప్రశ్నిస్తున్నారు.. కానీ, గ్రామ పంచాయతీ పాలన లేనప్పుడు తీర్మానం ఎలా చేస్తారో.. నాయకులు ఆలోచించుకోవాలని అన్నారు. అభివృద్ధికి ఆటంకం జరగకూడదనే ప్రత్యేక అధికారులను నియమించిన కాంగ్రెస్ ప్రభుత్వం వారికి అన్నిరకాల అధికారాలను ఇచ్చిందనేది గమనించాలన్నారు. కాంగ్రెస్ పాలనలో ములుగు జిల్లా అభివృద్ధిలో పరుగులు పెడుతుందనే విషయాన్ని చెప్పుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జయపాల్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మారం సుమన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల భరత్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజు, మావురపు తిరుపతిరెడ్డి, భగవాన్ రెడ్డి, వెంకటాపురం(ఎం) మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీను, ఓడ రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

- ఇర్సవడ్ల వెంకన్న



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

ఏటూరునాగారం: ములుగు జిల్లాను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి సీతక్క చొరవతోనే జిల్లాలో బస్సు డిపో ఏర్పాటుకు నిధులు మంజూరైనట్లు చెప్పారు. చేపల మార్కెట్ వద్ద రోడ్డు నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, చిన్నబోయినపల్లి నుంచి వెంకటాపురం రోడ్డు అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేసింది ఈ ప్రభుత్వమే అని తెలిపారు. ఈ అభివృద్ధి పనులు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావుకు కనపడడం లేదా.. అని ప్రశించారు. ఎస్సీ సబ్ ప్లాన్, కొండాయి బ్రిడ్జి, పాఠశాలల మరమ్మతులు, ఎలిశెట్టిపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణం సీతక్క ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. సీతక్కపై అనుచిత వాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. పండుగలకు మండలాల్లో తిరగడంకాదని, ప్రజా క్షేత్రంలో ఉండి ప్రజల సమస్యలను తీర్చాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీతక్కను విమర్శించడం సరికాదు

- బొల్లు దేవేందర్



సమావేశంలో మాట్లాడుతున్న బొల్లు దేవేందర్

ఎస్ఎస్ తాడ్వాయి : రాష్ట్ర మంత్రి సీతక్కను విమర్శించే స్థాయి బీఆర్ఎస్ పార్టీ నాయకులకు లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ.. మంత్రి సీతక్క మారుమూల అటవీ ప్రాంతాలైన లింగాల, కొశాపూర్, గొల్లపెల్లి గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణంతోపాటు గిరిజనులకు అందుబాటులోకి వైద్య సేవల కోసం రాష్ట్రంలోనే తొలిసారిగా కొశాపూర్‌లో కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేశారన్నారు. బీఆర్ఎస్ నాయకులకు సీతక్క చేస్తున్న అభివృద్ధి పనులు కనిపించడం లేదా.. అని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొండాయి బ్రిడ్జి నాణ్యత లోపంతో కట్టడం వల్ల వర్షాలు, వరదలకు కొట్టుకపోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడిన అనంతరం మంత్రి సీతక్క బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన విషయాన్ని మర్చిపోయి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక మాఫియాతో పొందిన లబ్ధి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో లేకపోవడంతో మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే సీతక్కపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బీఆర్ఎస్ పదేళ్ల హయాంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. సీతక్కపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో మేడారం జాతర చైర్మన్ లచ్చుపటేల్, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ముజాఫర్, మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రేగ కల్యాణి, మాజీ సర్పంచ్ ఇర్ప సునిల్, నాయకులు పాక రాజేందర్, జగన్, చంద్రయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే సంత నిర్వహణ



సంతలో ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బంది పడుతున్న వాహనదారులు(ఫైల్)

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

చిట్యాల: మండల కేంద్రంలో నాలుగు సంత్సరాల నుంచి ప్రతీ సోమవారం వారసంతను నిర్వహిస్తున్నారు. మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉండగా మండలవాసులు సంతలోనే కూరగాయాలు తీసుకెళ్తుంటారు. కాగా, సంతను రోడుపై నిర్వహించడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే వాహనాలు ఈ దారి గుండానే పోవాల్సి ఉంటుంది. సంతకు వచ్చే వారు రోడ్డుపైనే వాహనాలను నిలిపేయడంతో నిత్యం ట్రాఫిక్ జామై వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దీంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. సంత కోసం అనువైన స్థలం లేకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి స్థలాన్ని కేటాయిస్తే ఇబ్బందులు లేకుండా ఉంటుందని తెలుపుతున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సంతకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నారు.

ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలి



మండల కేంద్రంలో ప్రతీ సోమవారం కూరగాయాల సంత నిర్వస్తారు. రోడ్డు పైనే నిర్వహిండంతో ఇబ్బంది పడుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి సంత కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలి.

- ర్యాకం రవీందర్, చిట్యాల

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని పెంచికలపేటలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన బొంతల సాయికుమార్ (28) శనివారం రాత్రి కేశవాపూర్ నుంచి పెంచికలపేటకు బైక్‌పై దుకాణానికి వెళ్లి తిరిగి కేశవాపూర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం దామెర క్రాస్‌రోడ్ సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కానీ సాయికుమార్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సోదరుడు క్రాంతికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు సీఐ సంతోశ్ తెలిపారు.